గ్రామాల్లో కుక్కల స్వైర విహారం

- బెంబేలెత్తుతున్న జనం
- ప్రతి రోజూ ఆస్పత్రులకు వీధి కుక్కల బాధితులు
- విచ్చలవిడిగా సంచారం.. పాఠశాలలు, హోటళ్ల వద్ద మోహరింపు
- పిల్లలు, మహిళలు, వృద్ధులపై దాడి
- నియంత్రణ చర్యలు లేవీ?
- సుప్రీంకోర్టు ఆదేశాలతో వాటి బెడద తీరేనా?


భీమడోలులో గుంపులుగా తిరుగుతున్న గ్రామ సింహాలు

భీమడోలు: నియోజకవర్గంలో గ్రామ సింహాల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లో రోజురోజుకు పెరుగుతూ రాత్రి వేళల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ... ప్రజలపై దాడి చేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, యువకులు, మహిళ లపై దాడి చేస్తున్నాయి. గ్రామాల్లో ప్రతి రోజు కుక్కల బారిన పడిన వారి సంఖ్య పెరగడంతో ప్రజలు మరింత ఆందోళనకు గురి చెందుతున్నారు. స్కూల్‌కు వెళ్తున్న పిల్లలు, తెల్లవారుజామున వ్యాయామం చేసే వృద్ధులు, మార్కెట్‌కు వెళ్లే మహిళలపై వీధి కుక్కలు దాడి చేసి పిక్కలు పీకేస్తున్నాయి. దీంతో ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే భీతిల్లిపోతున్నారు. పశువులపై దాడి చేస్తున్నాయి. ప్రతి రోజుకు వీధి కుక్కల దాడిలో గాయపడిన బాధితుల సంఖ్యలో పెరుగుతున్నా సంబంధిత అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కుక్కలు పరుగులు తీస్తే వారిపై తీవ్రంగా దాడి చేస్తున్నాయి. మోటార్ బైక్‌లపై వెంబడించి మరీ గాయాలు చేస్తున్నాయి. కుక్కలను వేరే ప్రాంతానికి తరలిస్తున్నా... తిరిగి యథా స్థలాలకు వస్తుండడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ప్రజలు వాపోతున్నారు. కుక్కల బెడద నివారణకు సమగ్ర చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వేలాదిగా కుక్కల దాడి బాధితులు

ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో ఆరు పీహెచ్‌సీలున్నాయి. భీమడోలులో సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. పదేళ్లలో సగటును 2వేల మందికి పైగా కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి కుక్క కాటుకు గురై 2, 3 మంది చికిత్స పొందుతున్నారు. వీరే కాక సమీపంలోని పీహెచ్‌సీల్లో కుక్క కాటుకు ప్రాథమ చికిత్స పొంది, నివారణకు రెబీస్ వ్యాక్సిన్లు వేయించుకున్నారే. ప్రతి నెలకు రూ.60 నుంచి 80 మంది వరకు కుక్క దాడి బాధితులు కావడం గమనార్హం. పొలసానిపల్లిలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలకు వెళ్లితే కుక్క కరిచింది. భీమడోలు జంక్షన్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలోకి వెళ్లిన కుక్కలు ముగ్గురు విద్యార్థులపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి వారిలో ఒక బాలుడు ఉన్నాడు. విజయవాడ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేసుకున్నవారు ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు రాకుండా ప్రైవేటు ఆసుపత్రి వెళ్లే వారు రెట్టింపు బాధితులున్నారు. ప్రతి గ్రామంలో వీధి కుక్కల దాడులు నిత్యకృత్యంగా మారాయి.


భీమడోలులో ఓ వ్యక్తిని ముఖంపై కరిచిన పిచ్చి కుక్క


పొలసానిపల్లికి బాలుడిని కరిచిన కుక్క


చేతిపై కుక్క కాట్లు

నివారణ చర్యలేవీ?

వీధి కుక్కల నివారణ చర్యలపై అధికారుల స్పందన కరువైంది. వీధి విచ్చలవిడి సంచరించడం, యథేచ్ఛగా తమ సంతానాన్ని పెంచుకోవడం ద్వారా వీధి కుక్కలు పెరిగిపోతున్నాయి. వాటికి టీకాలు వేసి సంతానోత్పత్తి జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పశుసంవర్ధక శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు గ్రామ సింహాల బెడదను నియంత్రించేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వీధి కుక్కల బెడదపై పడుతున్న ఇబ్బందులపై ప్రజలు కోర్టుల్లో పిల్స్ వేసారు. దీనిపై ఇటీవల సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. వీధి కుక్కలను సమగ్ర విధానంలో నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. గ్రామంలో ఓ షెడ్డు నిర్మించి కుక్కలన్నింటిని అక్కడ భద్రపర్చి సంరక్షించేలా తగు చర్యలు చేపట్టనున్నట్లు తెలిస్తోంది.

తరిమినందుకు వెంటాడి కరిచింది



భీమడోలులో ఎరువుల దుకాణంలో పని చేస్తుంటాను. ఈ నెల 13వ తేదీన ఓ పిచ్చికుక్క షాపులోకి వచ్చింది. దీనిని తరిమేందుకు వెళ్లగా ఒక్కసారిగాదాడిచేసి చేతులు, ముఖం పైన, కాళ్లపై తీవ్రంగా గాయపర్చింది. వెంటనే పరుగులు తీశాను. అయినా వెంటాడి కరిచింది. భీమడోలు సీహెచ్‌సీలో రెబీస్ వ్యాక్సిన్ వేయించుకున్నాను. అదేరోజు నేదూరి లక్ష్మీ అనే మహిళను అదే కుక్క కరిచింది.

– దూలం సత్యనారాయణ, గుమాస్తా, భీమడోలు

కుక్కల నియంత్రణకు చర్యలు చేపడతాం

గ్రామాల్లో రోజురోజుకు తీవ్రమవుతున్న కుక్కల బెడదపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటాం. కుక్కలు సంచరించే ప్రదేశాలపై జాగ్రత్తలు పాటించండి. ఒంటరిగా పిల్లలు, మహిళలు, వృద్ధులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు పాటించండి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

– ఎస్.సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీవో, భీమడోలు

క్లుప్తంగా

కృష్ణాష్టమి ఫ్లెక్సీలు కూడా చింపేస్తారా?


పోతునూరులో ఫ్లెక్సీని చించివేసిన దృశ్యం

దెందులూరు: కృష్ణాష్టమి పండుగకు ఫ్లెక్సీలు సైతం చించివేసే సాంప్రదాయానికి తెరతిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి, గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. శనివారం పోతునూరులో విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి శిలాఫలకాలు, విగ్రహాలు ఫ్లెక్సీలు అన్ని ధ్వంసం చేశారు. పండుగకు ఫ్లెక్సీలు వేసినా కూడా తట్టుకోలేకపోతున్నారని, ఇది మంచి సాంప్రదాయం కాదన్నారు. దేవుడు పండక్కి వేసిన ఫ్లెక్సీలు ఎవరికి ఏం అడ్డొచ్చాయని ప్రశ్నించారు. రోజులు ఎప్పుడు ఒకేలాగా ఉండవని పరిస్థితులు మారుతూ ఉంటాయని ఫ్లెక్సీలు చింపేసినవారు చేయించినవారు గుర్తుపెట్టుకోవాలని ఫ్లెక్సీలు చించివేతపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


ముప్పర్తిపాడులో విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న దృశ్యం

గణపవరం: మండలం ముప్పర్తిపాడు గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు ఈదర సాయిప్రసాద్ తన తండ్రి నర్సింహమూర్తి జ్ఞాపకార్థం విద్యార్థులకు రూ.60వేల విలువైన బహుమతులు అందజేశారు. యుపీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులకు మూడు సైకిళ్లు, ఉత్తమ విద్యార్థులకు రూ.30 వేల రూపాయల నగదు బహుమతులు అందజేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. దాతను సర్పంచ్ కర్రిరాధాలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఎంసి చైర్మన్ ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి ఎక్స్‌రే సౌకర్యం


సీహెచ్‌సీలో ఎక్స్ రే యూనిట్

దెందులూరు: నియోజకవర్గ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) దెందులూరుకు ఎక్స్‌రే సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ సుందర్ కుమార్ అన్నారు. రోగులు ఇకపై ఉచితంగా ఎక్స్‌రే సౌకర్యాన్ని పొందాలని సూచించారు. గ్రామస్థాయి వైద్య సిబ్బంది దెందులూరు సీహెచ్‌లో ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యూనిట్ కి సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయాలని డాక్టర్ సుందర్ కోరారు.

గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి


గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ దుర్గాకుమారిరాజు

దెందులూరు: ప్రాధాన్యత క్రమంలో గ్రామ సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని మేధినరావుపాలెం గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఎం.దుర్గాకుమారిరాజు అన్నారు. మేధినరావుపాలెం సచివాలయంలో గ్రామసభ జరిగింది. సమావేశంలో గ్రామంలోని ప్రధాన సమస్యలు చర్చించారు. అందరి సహాయ సహకారాలతో పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని వివరించారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్లు, కూటమి నాయకులు రమేష్ రంగారావు తదితరులు ఉన్నారు.

ఐఐటీల్లో మెరిసిన సోదరులు


ఐఐటీల్లో మెరిసిన అన్నదమ్ములు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలం ద్వారకానగర్‌కు చెందిన అన్నదమ్ములు ఎన్ ఆశీష్, ఎన్ అనీష్ ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో సీట్లు సాధించారు. ఐఐటీలో చదవాలనే కాంక్షతో ముందునుంచే ఒక ప్రణాళిక తో కష్టపడి చదవడం వల్ల తల్లిదండ్రుల, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, గురువుల సహకారంతో విజయం సాధించామని వారు తెలిపారు. ఇటీవల జరిగిన 2025, ఆల్ ఇండియా గేట్ ఎగ్జామ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి ఐఐటీ గౌహతి ఎయిరోస్పేస్‌లో ఆశీష్, ఐఐటీ బాంబే మెకానికల్‌లో అనీష్ సీట్ సాధించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

వినాయకచవితికి అనుమతులు తప్పనిసరి


పెదవేగి ఎస్ఐ కె రామకృష్ణ

పెదవేగి : మండలంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే మండపాలకు పోలీస్, అగ్నిమాపక, విద్యుత్‌శాఖలతో పాటు గ్రామ పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాలని పెదవేగి ఎస్ఐ కె రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా గట్టి భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. చవితి మండపాల నిర్వాహకులు ఎక్కడా బలవంతపు వసూళ్లకు పాల్పడకూడదని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా విగ్రహాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. విగ్రహాల నిమజ్జన విషయాలను ముందుగా పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

హైస్కూల్‌కు మైక్‌సెట్ అందజేత


చిలకంపాడు హైస్కూల్‌కు మైక్‌సెట్ అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

గణపవరం: గణపవరం మండలం చిలకంపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన ఎంపీటీ జీవీఎస్ఎన్ మూర్తి రూ.10వేల విలువైన మైక్‌సెట్‌ను బహూకరించారు. మైక్‌సెట్‌ను సర్పంచ్ చుక్కా అప్పారావు హెచ్‌ఎంకు చింతలపాటి దుర్గాభవానికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ బొల్లం దుర్గారావు, ఎస్‌ఎంసి చైర్మన్ మామిడిశెట్టి రాణి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుడ్ల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ


భీమడోలులో శ్రీకృష్ణుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

భీమడోలు: మండలంలోని భీమడోలులోని గుర్రాల చెర్వు గట్టుపై కనకదుర్గాదేవి ఆలయం వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించారు. శ్రీకృష్ణజన్మాష్టమిని పురస్కరించుకుని ఈ ప్రతిష్ఠాపనా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గ్రామ పరిధిలోని రాజకీయాలకుతీతంగా పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గొరిపర్తి ఆంజనేయస్వామి, ఆకుల వీర్రాజు, మంగదొడ్డి శ్రీనివాస్, ఎఎంసీ చైర్మన్ శేషగిరి, పెద్దలు ప్రత్తి మదన్, కుక్కల ప్రసాద్, ఆదిరెడ్డి సత్యనారాయణ, యుగంధర్, తాటిమళ్ల రామ్మూర్తి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు


లైన్‌మెన్‌ను అభినందిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ

దెందులూరు: అంకితభావంతో కూడిన శాఖాపరమైన విధి నిర్వహణ ఏరంగంలోనైనా గుర్తింపు తెచ్చిపెడుతుందని దెందులూరు ఎస్ఐ ఆర్ శివాజీ, విద్యుత్ శాఖ దెందులూరు అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఉత్తమ హెడ్ కానిస్టేబుల్, ఉత్తమ లైన్‌మెన్‌గా అవార్డులు పొందిన ఎస్ సత్యనారాయణ, చిలకా నాగరాజులను అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెదపాడు: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వట్లూరు సీఆర్‌ఆర్ మహిళా కళాశాల యంబీఏ విభాగం విద్యార్థులు వట్లూరు గ్రామంలో అవగాహన కల్పించారు. ఎంబీఏ కో ఆర్డినేటర్ ఏ జ్యోతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిశుభ్రతను పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు గౌరీశంకరుల విగ్రహ ప్రతిష్ట


విద్యుత్ దీపాలంకరణలో స్వామివారి ఆలయం

దెందులూరు: మండలంలోని పోతునూరు గ్రామం కొత్తూరులో నూతనంగా నిర్మించిన గౌరీ శంకరుల నూతన ఆలయంలో ఆదివారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం ఉదయం 11. 44 గంటలకు గౌరీశంకర, విగ్నేశ్వర కుమారస్వామి, ఆంజనేయ విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మహా అన్నసమారాధన జరుగుతుందని కొత్తూరు పోతునూరుతోపాటు సమీప గ్రామాల్లో భక్తులు ఈకార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీర్వచనాలు పొందాలని కోరారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


ఉంగుటూరు: ప్రత్యేక వేషధారణలో చిన్నారులు

దెందులూరు: మండలంలోని పోతునూరులో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. శనివారం ఉదయం ప్రత్యేక వాహనం పై శ్రీకృష్ణ భగవానుని ప్రతిమను ఉంచి పోతునూరు గ్రామంలో అన్ని పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. పాటిమీద నుంచి ప్రారంభమై స్వరాజ్ పవన్ లక్ష్మీపురం గాంధీ బొమ్మ సెంటర్ అంబేడ్కర్ బొమ్మ సెంటర్ మీదుగా ఊరేగింపు సాగింది. ఈ 0కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తలారి రామకృష్ణ, బొమ్మనబోయిన శ్రీనివాసరావు, నాగనబోయిన ఉయ్యూరు, కొప్పుల చిన్నబాబు, నున్న శివ, భవాని, బొమ్మనుబోయిన బాలకృష్ణ, బుర్ర బసవయ్య, నున్న లక్ష్మణ, బోడాల ఏసుబాబు, నాగనబోయిన రాజేష్, నరసింహారెడ్డి, నాగనబోయిన ప్రభు, బోర్ల సూర్య, తోకల సుబ్బారావు ఉన్నారు.

పెదపాడులో..

పెదపాడు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారికి ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేదాంతం శ్రీనివాసాచార్యులు పూజలు జరిపారు.

ఉంగుటూరులో...

ఉంగుటూరు: మండలంలోని కైకరం సాయిబాబా ఆలయంలో పెద్దిరెడ్డి వేణు గోపాల కృష్ణ ప్రసాదరావు, శేషవేణి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా శుక్రవారం చిన్నారులకు క్విజ్ పోటీ, డ్రాయింగ్ పోటీ, శనివారం శ్రీకృష్ణ, గోపికల వేషధారణ పోటీలు, ఉట్టి పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో గెలిచిన విజేతలకు ముత్తంగి వెంకట వేణు గోపాల్ సహకారంతో బహుమతులను అందజేశారు.


పెదపాడు: రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


గణపవరం: కృష్ణాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


దెందులూరు: స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

గణపవరంలో...

గణపవరం: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. గణపవరం యాదవ సంఘం ఆధ్వర్యంలో చినరామచంద్రపురం వైఎస్సార్ కాలనీలోని రుక్మిణిసమేత శ్రీకృష్ణాలయంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయప్రాంగణంలో గోమాతకు పూజలు నిర్వహించారు. ఆలయకమిటి చైర్మన్ బైరబోయిన మాల్యాద్రియాదవ్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. బువ్వనపల్లిలోని శ్రీకృష్ణాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయవద్ద ఉట్టికొట్టే కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం, నిడమర్రు సబ్‌స్టేషన్‌లలో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. కావున ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రాచూరు, రావులపర్రు, సీతారాంపురం గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాన్ ములగడ సమాజానికి ఆదర్శప్రాయులు


జాన్‌ములగడ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

దెందులూరు: ఏలూరు ప్రథమ పీఠాధిపతి జాన్ ములగడ సమాజానికి ఆదర్శప్రాయులని ఏలూరు వికార్ జనరల్, సోమవరప్పాడు బీఈడీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి బాల అన్నారు. శనివారం బీఈడీ కళాశాలలో ఏలూరు ప్రథమ పీఠాధిపతి జాన్ ములగాడ 16వ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్లు అధ్యాపకులు ఉన్నారు.

నీరు ఇలా.. సాగు ఎలా..

దెందులూరు: భారీ వర్షాలు తమకు మరోసారి నష్టాన్ని తెచ్చిపెట్టాయని దెందులూరు నియోజకవర్గం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెందులూరు మండలంలో కొవ్వలి, పోతునూరు, ఉంద్రాజవరం గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో వరి నీట మునకకు గురైంది. ఏలూరు రోడ్లు మండలంలో పాలగూడెం పంచాయతీ పరిధిలో ఆశ్రమం వైద్యశాల ఎదుట వ్యాసకాని బ్రిడ్జి దిగువ 100 ఎకరాల్లో నేటికీ నీరు అలాగే ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాదిరిగా ప్రస్తుతం పంటలు పెట్టుబడి అందకపోయినా అప్పులు తెచ్చి పంటలపై పెట్టుబడి పెడితే మా రాత బాగోక ప్రకృతి రూపంలో నాటిన సమయంలోనే పొలాలు ముంపుకు గురైతే ఎవరితో చెప్పుకోవాలి ఇంకా ఎక్కడ డబ్బులు తెచ్చి పంటలపై పెట్రోల్ పెట్టాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు పాటు వర్షాలు కురిస్తే తాము పూర్తిగా నష్టపోయి నట్టేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు మునిగిన వరి పొలాలను పరిశీలించి ప్రభుత్వాలకు నివేదిక అందించి ఎంతో కొంత సాయం అందేలా కృషి చేయాలని అధికారులను రైతులు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న వరిచేలు